క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మారుతి

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన అంజి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల విద్యుత్ స్తంభంపైకి ఎక్కి వైర్లు సరిచేస్తుండగా షాక్‌కు గురై కింద పడడంతో నడుము పూర్తిగా విరిగిపోయింది. దీంతో వైద్యానికి డబ్బులు లేకపోవడంతో వారు దాతల సహకారం కోరగా విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి గురువారం వారి ఇంటికి వెళ్లి మనోధైర్యం కల్పించి రూ.5,000 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ ఇన్‌చార్జ్ ఆకుల ప్రతాప్, గూడూరు రఘుపతి రెడ్డి, బుజ్జారి వేణుగోపాల్, బుజ్జారి వీరన్న, సీనియర్ జర్నలిస్టు రాళ్ల బండి శ్రీనివాస్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రామ్‌చందర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన రామ్‌చందర్‌రావును మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



వెంకటస్వామి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటనలో మండలంలోని కొత్తపల్లి(ఎస్ఎం) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం దూత్‌పల్లి గ్రామానికి చెందిన అంకేశ్వరపు వెంకటస్వామి(45) కొత్తపల్లితో గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తు జీవనం సాగిస్తూండేవాడు. కాగా గురువారం కొత్లపల్లి గ్రామంలో రైతుకు సంబంధించిన విద్యుత్ పోల్‌పై మరమ్మతు పనులు చేస్తుండగా షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వె ళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రేగొండ: పాము కాటుకు గురైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాశీందేవిపల్లి గ్రామానికి చెందిన గాజుల వనమాల (49) భర్త సుబ్బయ్యతో కలిసి ఈ నెల 6న కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడేపాక గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఆమెను పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగని రేషన్ బియ్యం దందా!

- అర్ధరాత్రి మిల్లులకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలో రేషన్ బియ్యం దందా జోరుగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున మూడు నెలలు ఒకేసారి బియ్యం ఇచ్చింది. ఇదే అదనుగా భావించిన బియ్యం దళారులు అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ కార్డుతో ఇచ్చే సన్నబియ్యం కొంత మంది లబ్ధిదారులు తినకపోవడంతో వారిని గుర్తించేందుకు అక్రమ వ్యాపారులు గ్రామాల్లో కొంత మందిని పైలెట్‌గా పెట్టుకుంటున్నారు. ఆ పైలెట్ గ్రామాల్లో తిరుగుతూ వారిని గుర్తించడంతో పాటు ఎవరైనా నిఘా అధికారులు ఉన్నారా అని ఆరా తీసుకుంటు బియ్యం వ్యాపారికి సమాచారం అందిస్తూంటాడు. అలాగే గ్రామాల్లోని ప్రజల వద్ద ఉన్న సన్న బియ్యం కొనుగోలు చేసేందుకు మధ్య దళారులు కిలోకు రూ.20 చొప్పున తీసుకుని



కొత్తపల్లిలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న బియ్యం లారీ(ఫైల్)

బియ్యం దందా సాగించే వ్యాపారికి అమ్ముతున్నారు. దీంతో ఆ బియ్యం వ్యాపారి గ్రామాల్లో ఉన్న బియ్యాన్ని ఒక చోట సమాకూర్చుకుని వాటిని ఒకేసారి లోడు చేసుకుని అర్ధరాత్రి మిల్లులకు తరలిస్తున్నారు. మండలంలో జోరుగా బియ్యం దందా జరుతుందని అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దళారులు పలువురి అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇచ్చే సన్న బియ్యం అమ్మినా, దళారులు కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టుబడితే రేషన్ కార్డును తొలగిస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తాం.

- షేక్ ఇమామ్‌బాబా, తహసీల్దార్, చిట్యాల

నానో యూరియాతో పంటలకు మేలు

- ఏఓ సురేందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: నానో యూరియాతో పంటలకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద నానో యూరియా వల్ల లాభాలు, సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయ మార్గాల గురించి రైతులకు ఏఓ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా ద్రవ రూపంలో ఉండి మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తుందని తెలిపారు. నానో యూరియా వాడటం వల్ల భూగర్భ జలాల్లోకి నత్రజని చేరడం తగ్గుతుందని ఇది పర్యావరణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న సురేందర్‌రెడ్డి

కాలుష్యాన్ని నివారిస్తుందన్నారు. రైతులకు డబ్బు ఆదా అవుతుందని నానో యూరియా వాడకం వల్ల పంటల నాణ్యత కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు లేకుండా సరఫరా చేయాలి

కాటారం/కాళేశ్వరం: యూరియా సరఫరా చేసే కంపెనీలు ఎలాంటి లింకు నిబంధనలు పెట్టకుండా సప్లై చేసేలా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని అగ్రి డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్స్ డీలర్లు స్వయం ఉపాధి సృష్టించుకొని రైతులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూరియాపై నియంత్రణ విధించడాన్ని ఆసరా చేసుకొని ఫెర్టిలైజర్ షాప్‌లకు యూరియా సప్‌లై చేసే కంపెనీలు బయోగులికలు, వివిధ లింకు ప్రొడక్ట్‌లను బలవంతంగా అంటగడుతున్నాయని పేర్కొన్నారు. అదనపు లింకులు లేకుండా యూరియా సరఫరా అయ్యేలా ప్రభుత్వం



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

దృష్టికి తీసుకెళ్లాలని ఏడీఏను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు కట్కం అశోక్, కాటారం, మహాముత్తారం మండల అధ్యక్షులు కవ్వాల శేఖర్, గట్టు సమ్మయ్య, దోమ భాస్కర్, వెంకట్‌రెడ్డి, గట్టు రమేశ్, ఓదెలు, సంపత్, నరేందర్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

గుండ్లకర్తిలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యాస్మిన్

మొగుళ్లపల్లి: మండలంలోని గుండ్లకర్తిలో మండల వైద్యాధికారిణి నాగరాణి ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ యాస్మిని వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 46 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యాస్మిన్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్ఎం సులోచన, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మొక్కల సంసరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అధికారులు

మొగుళ్లపల్లి: మొక్కల సంసరక్షణ అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ శారద అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో గురువారం అటవీ శాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా మొక్కలు నాటారు. ముందుగా విద్యార్థులు గురువులకు పుష్పాంజలులు సమర్పించి, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా గురువుల గొప్పతనాన్ని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తహసీల్దార్ సునీత, ఎస్సై అశోక్, ఎఫ్ఆర్ఓ జ్యోతిరత్న, నవీన్‌రెడ్డి,రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఫ్లయాష్ బ్రిక్స్ ఓనర్స్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల ఫ్లయాష్ బ్రిక్స్ ఓనర్స్ అసోసియేషన్ కమిటీని మండలంలోని కొడవటంచ ఆలయ ప్రాంగణంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముకిరాల మధువంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బోయిని వినోద్‌కుమార్, కృష్ణారెడ్డి, ఆనందం, గౌరవ అధ్యక్షుడిగా వేణుగోపాలస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధువంశీకృష్ణ మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కేసు నమోదు

రేగొండ: విధి నిర్వహణలో ఉన్న నీటిపారుదల శాఖ లష్కర్‌పై దాడి చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిరేణికుంటలో అధికారుల అనుమతితో ఇందిరమ్మ ఇళ్లకు మొరం తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పరిశీలినకు వెళ్లిన లష్కర్ కొటం శంకర్‌పై రేగొండ మండల కేంద్రానికి చెందిన మేకల రవికుమార్ అనే వ్యక్తి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కాగా, బాధితుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

13న అర్హత పరీక్ష

భూపాలపల్లి రూరల్: సివిల్ సర్వీస్ టెస్ట్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

కేటీపీపీ ఉద్యోగి నిరంజన్‌రెడ్డికి డాక్టరేట్

గణపురం: గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న పల్లెర్ల నిరంజన్‌రెడ్డికి డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ 2025 సంవత్సరానికి గ్లోబల్ హ్యుమెన్ పీస్ యూనివర్సిటీ (అంతర్జాతీయ యూనివర్సిటీ యూఎస్ఏ) ప్రకటించింది. కాగా గత నెలలో చెన్నైలో నిర్వహించిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో గురువారం కేటీపీపీలో యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ కందుకూరి విజయ్ మోహన్, సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత యునివర్సిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్‌ల ఆధ్వర్యంలో కేటీపీపీ సీఈ చిట్టాప్రగడ ప్రకాశ్‌రెడ్డి అందచేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన



అవార్డు అందజేస్తున్న సీఈ ప్రకాశ్‌రెడ్డి

అవార్డు పొందిన కేటీపీపీ ఉద్యోగి నిరంజన్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

టేకుమట్ల: రేగొండలో ఈ నెల 13, 14న నిర్వహించే సీపీఐ జిల్లా ఐదో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెలిశాలలో సీపీఐ నాయకులతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ సీపీఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు సతీష్, రేనుకుంట్ల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రవీన్, రమాకాంత్, సంతోష్, పవన్, జోసెఫ్, మధూకర్, సమ్మయ్య, హరికృష్ణ, కుమార్, రామన్, ప్రసాద్, విజయ్, మానిష్ పాల్గొన్నారు.

సన్మానం

మలుగు రూరల్: జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రేగ కల్యాణిని గురువారం యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సూర్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధి కోసం, రైతుల శ్రేయస్సు కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ రవి, ఇస్సార్ ఖాన్, మారం సుమన్‌రెడ్డి, నల్లెల భరత్ కూమార్, గోవిందరావుపేట పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

గ్రామాన్ని తరలించే వరకు పోరాటం..

గణపురం: సింగరేణి యాజమాన్యం ఓసీ-3 ప్రాజెక్టులో భాగంగా పరుశరాంపల్లి గ్రామాన్ని తరలిస్తామని హామీ ఇచ్చిందని తమ గ్రామాన్ని తరలించే వరకు పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆరుగురు పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో మాట్లాడారు. తమ గ్రామాన్ని తరలించాలని గత నెలలో ఆందోళన చెపట్టడంతో పోలీసులు తమపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ రోజు పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగిందన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టిన గ్రామం తరలించే వరకు ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఉడుత నాగరాజు, కనుకుంట్ల సమ్మక్క, ఉడుత సుమ, చెన్నబోయిన కృష్ణ, హనుమండ్ల రాజు, చెన్నబోయిన రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



గణపురం: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



కాళేశ్వరం: పూజలు చేస్తున్న భక్తులు



కాటారం: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శ్రీనుబాబు దంపతులు



మల్హర్: సాయిబాబా విగ్రహానికి పూలతో అలంకరణ

గణపురం: మండల కేంద్రంలోని దత్తాత్రేయ సహిత సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే సత్యనారయణరావు హాజరయ్యారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయం శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా విశేషపూజలను ఉపప్రధాన అర్చకుడు ఫణీంద్రశర్మ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అభిషేక పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వసంత, మాజీ ధర్మకర్త అశోక్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లిలోని షీర్డీ సాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరాన్ని షీర్డీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకోని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దత్తత్రేయ, విఘ్నేశ్వర, సరస్వతి దేవతలను విశేష పూజలు చేసి గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కాటారం: మండల పరిధి ధన్వాడలోని దత్తాత్రేయ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు పాల్గొని స్వామి వారికి అభిషేకం, సహస్ర నామ అర్చన, మంగళహారతి, మంత్రపుష్పం చేశారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు శ్రీనుబాబు తెలిపారు. ఆలయంలో అన్నదానం, భజన కార్యక్రమాలు చేపట్టారు.

శిథిలావస్థలో మరుగుదొడ్లు



శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్డి



టేకులబోరులో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని టేకులబోరు, ఉప్పుడుగోల్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్డి శిథిలావస్థలో చేరుకున్నాయి. టేకులబోరులో విద్యార్థులు పాఠశాలలో ఓ మూలకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాగే ఉప్పుడువిగోల్లగూడెంలో ద్యార్థులు మరుగుదొడ్లు లేక గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్దకు వెళ్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



టేకులబోరు, ఉప్పేడుగోల్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు బయటకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు మరమ్మతు చేయడం లేదా కొత్తవి నిర్మించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-సతీష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్

మరమ్మతు చేయాలి



పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతులు చేయించాలి.

- రమేశ్, విద్యార్థి తండ్రి, ఉప్పుడుగోల్లగూడెం

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కటంగూరి రాంనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దూడపాక కొమురయ్య, సరిగొమ్ముల సమ్మయ్య, సరిగొమ్ముల రాజేశం, గడ్డం సారయ్య ఉన్నారు.